క్లుప్తంగా

పుల్లలచెరువు తహసీల్దార్‌గా వెంకటేశ్వరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువు తహసీల్దార్‌గా కె.వెంకటేశ్వరరావు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పొన్నలూరు రీ సర్వే డీటీగా పనిచేస్తున్న వెంకటేశ్వరరావుకు ప్రమోషన్‌పై తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు ఆయనకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

డీఏలు తక్షణమే ప్రకటించాలి

దర్శి (కురిచేడు): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు తక్షణమే ప్రకటించాలని, పీఆర్సీను వెంటనే అమలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక చౌటపాలెం రోడ్డు విశ్రాంత ఉద్యోగుల భవనంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఆర్సీపై చర్చించారు. పీఆర్సీ ఇప్పటికే పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు వర్తించదని కేంద్రం పేర్కొందన్నారు. ఈ విధానాన్ని మన ముఖ్యమంత్రి అనుసరించకూడదని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యవర్గ సభ్యులు వి.బాలాజి, ఎన్వీ సుబ్బయ్య, దేవసహాయం, సుబ్బారావు, కృష్ణ, రంగయ్య, నాగిరెడ్డి, వెంకటరెడ్డి, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుంకర బ్రహ్మారెడ్డి

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని మారెళ్లలో ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు కిమ్స్ వైద్యులు వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని సుంకర బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. 150 మంది రోగులకు వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ సునీల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి మెరుగైన వైద్య చికిత్సలు అవసరమని గుర్తించి వారిని ఒంగోలు రావాలని సూచించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. నాయకులు సుంకర హనుమారెడ్డి, రావులపల్లి నాగార్జున, బ్రహ్మం, సుంకర చిన్న బ్రహ్మారెడ్డి, తన్నీరు శ్రీను, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న సుజాత

తాళ్లూరు: ప్రతి గ్రామ సంఘం తీసుకున్న రుణాలకు సంబంధించి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, మళ్లీ ఎక్కువ మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని మండల సమైక్య అధ్యక్షురాలు ఎం.సుజాత అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమైక్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమైక్య అధ్యక్షురాలు ఎం.సుజాత మాట్లాడుతూ కొత్త రుణాలు తీసుకోవాలని, వాటిని సద్వినియోగం చేసుకొని గ్రామ సంఘంలోని మహిళలు లబ్ధి పొందాలన్నారు. ఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ గురించి వీఓఏలు గ్రూప్ సభ్యులకు అవగాహన కల్పించి వాటిని ఉపయోగించుకోవాలని ఏపీఎం దేవరాజు కోరారు. సీసీలు సూచంద్ర, వీఓఏలు, ఓబీ మెంబర్లు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్స్ తల్లిదండ్రులకు సన్మానం



కల్పన తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

యర్రగొండపాలెం: టెన్త్ టాపర్స్ ఇళ్ల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులను సోమవారం ఎంఈవో, ఉపాధ్యాయులు శాలువా కప్పి సన్మానించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థిని బొందిలి గాయత్రి సింగ్ 582 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బోయలపల్లి కల్పన 564 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలించింది. మంచి మార్కులు సాధించి పాఠశాలలకు మంచి పేరు తీసుకొచ్చిన గాయత్రి సింగ్‌కు రూ.5వేలు, కల్పనకు రూ.2 వేల ప్రకారం ఎంఈవో పి.ఆంజనేయులు ప్రోత్సాహక బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేసి తమ పిల్లలను పనులకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే కుటుంబానికి మంచి పేరు తీసుకొస్తారని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రతి సంవత్సరం ఇటువంటి ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. హెచ్ఎంలు రమాదేవి, శాఖమూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు చిట్టి నాయక్, పండరి, చెన్నకేశవులు, సీఆర్ఎంటీలు కోటేశ్వరరావు, హనుమా నాయక్, సురేష్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆగని పలుకురాయి అక్రమ తవ్వకాలు

● పట్టించుకోని అధికారులు



అటవీ భూమిలో అక్రమంగా తీసిన పలుకురాళ్లు

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబర్-8లో పలుకురాయి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గతంలో పలుకురాయి తవ్వకాలను రెవెన్యూ, మైన్స్ అధికారులు అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బంది తవ్వకాలు జరపకుండా కాపలాగా ఉన్నారు. సర్వే నంబర్-8లో భూమి ఆక్రమణలపై కూడా నిషేధం విధించి రెవెన్యూ అధికారులు బోర్డు కూడా ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేసిన తర్వాత నిషేధిత భూమిలో తిరిగి పలుకురాయి తవ్వకాల కోసం బ్లాస్టింగ్ చేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిలువరించలేకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి చూసి వెళ్తున్నారు తప్ప అక్రమంగా తవ్వకాలు జరిపే వారిని గుర్తించి వారిపై చర్యలు చేపట్టక పోవటంతో అటవీశాఖ అధికారుల పాత్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా పలుకురాయి తవ్వకాలు చేస్తున్న ముఠాపై అధికారులు కఠిన చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అక్రమార్కులు యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు నిర్వహించడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అక్రమంగా పలుకురాయి తవ్వకాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని తిరిగి తవ్వకాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లి విస్తృత పర్యటన



లంకోజనపల్లిలో క్షతగాత్రురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి



డాక్టర్ జమాల్ నాయక్‌ను పరామర్శిస్తున్న బూచేపల్లి

● ప్రమాద బాధితులకు పరామర్శ

దర్శి (కురిచేడు): ఇటీవల పలు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను, అనారోగ్యానికి గురైన పార్టీ కార్యకర్తలు, నాయకులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలో విస్తృత పర్యటన చేసి అందరికీ తానున్నానంటూ భరోసా కల్పించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజనగర్‌కు చెందిన పార్టీ నాయకులు మస్తాన్ వలి కుమారుడు రఫీ ఇటీవల ఆటో ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బూచేపల్లి వారి ఇంటికి వెళ్లి రఫీ ఆరోగ్యానికి సంబంధించిన వైద్య పరీక్షల రిపోర్టులు పరిశీలించారు. చికిత్స అందించిన వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దేవవరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన భవనాసి చిన్న ఏసును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలపై నాయకులతో చర్చించారు. కట్టుబడివారిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త తేళ్ల జేమ్స్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని జాగ్రత్తలు తెలిపారు. ప్రముఖ హోమియో వైద్యుడు, షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తండ్రి డాక్టర్ జమాల్ నాయక్‌ను వెంకటాచలంపల్లిలోని ఆయన గృహంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. లింగన్నపాలెంలో ఎంపీటీసీ తండ్రి బండి గోపాల్‌రెడ్డి దశదిన కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో గాయపడిన గ్రామ నాయకుడు బండి కృష్ణారెడ్డిని పరామర్శించారు. మండలంలోని లంకోజనపల్లిలో సర్పంచ్ కొరివి కోటయ్య భార్య దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల ముండ్లమూరు మండలం ఉల్లగల్లు వద్ద కూలీల ఆటో ప్రమాదంలో గాయపడిన లంకోజనపల్లి గ్రామానికి చెందిన కూలీలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు కొరివి ముసలయ్య, సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, నలదిమ్ము రమణారెడ్డి, కాసు కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎంఈఓ మస్తాన్‌నాయక్



శిబిరానికి హాజరైన విద్యార్థులు, పాఠకులు

దర్శి (కురిచేడు): వేసవిలో విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పొందాలని ఎంఈఓ కె.రఘురామయ్య కోరారు. స్థానిక గ్రంథాలయ శాఖా కార్యాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ఎంఈఓ-2 రమాదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు వివరించారు. ఎంఈఓ రమాదేవి మాట్లాడుతూ చక్కటి గ్రంథాలయాలను ఉపయోగించుకుని మంచి మంచి కథలు చెప్పటం, చెప్పించటంతో ఉపయోగమన్నారు. తాము కూడా గ్రంథాలయాల్లో చదువుకొని ఈ స్థాయికి చేరామన్నారు. బీడీసీఎల్ నిర్వాహకులు బి.కోటయ్య, బి.చెంచులింగం, భూషణ్‌రావు, బి.గోపి, టీచర్ ఆదిలక్ష్మి, గ్రంథపాలకురాలు విజయకుమారి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పంచి పెట్టే విధంగా గ్రంథాలయాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు తమ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. 40 రోజుల పాటు జరిగే విజ్ఞాన శిబిరంలో కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, మ్యూజిక్, డ్యాన్స్, పప్పెట్ మేకింగ్, డ్రామ, చెస్, క్యారమ్స్, క్విజ్, జీకేలతో పాటు ఇతర అంశాలను నేర్పించనున్నట్లు గ్రంథపాలకురాలు కె.రుూన్సీ తెలిపారు. తమ పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లే విధంగా ప్రోత్సహించి వారిలో మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకునే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చెన్నకేశవ స్వామి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. శిక్షణ శిబిరం ప్రారంభోత్సవానికి ఎంఈఓ మస్తాన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రంథాలయాలు.. వాటి విశిష్టత వివరించారు. గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నకండ్లేరు ప్రాజెక్టు సాధనకు కదలి రావాలి

● పోస్టుకార్డు ఉద్యమంలో రైతులు



పోస్టుకార్డు ఉద్యమంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

పుల్లలచెరువు: పుల్లలచెరువులో ఉన్న చిన్నకండ్లేరు ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, దాని సాధన కోసం రైతులంతా కదలి రావాలని తీగలేరు సాధన సమితి కార్యదర్శి గురునాథం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రాచకొండలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఉద్యమ నాయకులు రాములు, రఘు మాట్లాడుతూ మండలంలో సాగు,తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇటీవల పుల్లలచెరువు మండలాన్ని తీవ్ర కరువు మండలంగా ప్రకటించిందంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సంవత్సరాల కాలంలో వెలుగొండ ప్రాజెక్టును ఏర్పాటు చేసి ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి వచ్చే టీ5 కాలువను చిన్నకండ్లేరు ప్రాజెక్టు వరకు పొడిగించే విధంగా చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. రైతులు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమితి అధ్యక్షుడు రఘు, వెంకటరెడ్డి, కోటిరెడ్డి, బంగారురెడ్డి, యల్లారెడ్డి, ఎరుకలయ్య, వెంకట రమణ, రైతులు పాల్గొన్నారు.

వేసవిలో పశు సంరక్షణ అవసరం



గొర్రెకు ఇంజెక్షన్ వేస్తున్న పశువైద్యాధికారి కరిష్మా (ఫైల్)



పశు పోషకులతో మాట్లాడుతున్న పశు వైద్యాధికారి

దొనకొండ: వేసవి కాలంలో ఎండ తీవ్రత పెరిగి మూగ జీవాలు విలవిల్లాడుతూ వడ దెబ్బకు గురవుతాయి. పశుగ్రాసం, నీటి కొరతతో అస్వస్థతకు గురవుతాయి. ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు సూర్య రశ్మితో శరీరంలో జీవక్రియల్లో మార్పులు జరిగి పశువులకు వడదెబ్బ తగులుతుంది. వేసవి తీవ్రతకు దేశీయ ఆవులు, ఎద్దులు కొంతమేర తట్టుకుంటాయి. కానీ గేదెలు, విదేశీ జాతి పశువులు ఎక్కువగా వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. వడ దెబ్బలో పాడి పశువుల్లో పాల ఉత్పత్తి బాగా తగ్గిపోతుంది. సూడి కడితే ఆలస్యం అవుతుంది. గేదెల కంటే ఆవులు ముఖ్యంగా శంకర జాతి ఆవులు చాలా సున్నితమైనవి. పరిసర ఉష్ణోగ్రతల్లో ఏ చిన్న మార్పు సంభవించినా తట్టుకోలేవు. వేసవిలో పశువుల్లో ఉత్పత్తి, పునరుత్పత్తి సమస్యలు కలుగుతాయి. వేసవిలో పశుగ్రాసం కొరత అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పచ్చి గడ్డి కొరత ఎక్కువగా ఉండి పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. ప్రతి వేసవిలో చాలా మంది రైతులు పశువులను మేపలేక సంతలో అమ్ముతుంటారు. పశుగ్రాస కొరతను నివారించేందుకు రైతులు ముందు జాగ్రత్తగా పశువులకు మేత సమకూర్చుకోవాలి. పంట పొలాల్లో రెండో పంటగా వరి వేసిన మాగాణి భూముల్లో కోతలు అయిన తర్వాత మినుము, పెసర పండించవచ్చు. అలాగే పొలాల గట్లపై, పెరటి తోటల్లో, బావుల కింద సహితం పశుగ్రాసాన్ని పండించుకోవాలి. పశువులకు మేతనిచ్చే చెట్ల పెంపకం చేపట్టాలి. అవిశ, సుబాబులు, గిరిశన లాంటి పశువులకు మేతగా ఉపయోగించే పశుగ్రాసం చెట్లు పెంచుకోవాలి. పశువులు తాగేందుకు నీటిని ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి. వడదెబ్బకు గురైన పశువులకు వీలైనంత త్వరగా ప్రథమ చికిత్స అందించాలి. వేసవిలో పశువులను వీలైనంత ఎక్కువ సార్లు నీటితో తడుపుతూ ఉండాలి. వేసవిలో పశువులను ఉదయం 7 నుంచి 10 గంటల్లోపే మేతకు వదలాలి. మధ్యాహ్నం వేళల్లో తప్పని సరిగా పాకలో ఉంచాలి. పశువులను చెరువు, కాలువల్లో ఈతకు వదలాలి. వేసవిలో పశువులకు వ్యాధులు రాకుండా ముఖ్యంగా గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ఈ విధంగా వేసవిలో పశు పోషకులు అన్ని రకాల జాగ్రత్తలను తీసుకుని అధిక ఉష్ణోగ్రతల నుంచి పశువులను కాపాడుకుంటూ పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకోవాలని వైద్యాధికారి కరిష్మా పశు పోషకులకు సూచన, సలహాలు అందజేశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: భూమిలో సేంద్రియ ఎరువులు వాడి సమగ్ర పోషక యాజమాన్యం చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కె.బుజ్జిబాయి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పచ్చిరొట్టెల సాగుపై గ్రామ వ్యవసాయ సహాయకులకు సోమవారం అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ పచ్చి రొట్ట పైర్లను సాగు చేసే విధంగా రైతులకు చెప్పాలన్నారు. వేసవిలో త్వరగా పెరిగే పప్పుజాతి పైర్లు జనుము, జీలుగ, పెసర, పిల్లి పెసర, అలసంద విత్తనాలు సాగు చేసుకోవాలన్నారు. ఇప్పుడు సాగు చేసుకున్న పచ్చిరొట్ట పంటను జూలై, ఆగస్టు మాసాల్లో పొలంలో కలియదున్నాలని చెప్పారు. వీటి పైర్లపై ఉంటే రైజోబియం బ్యాక్టీరియా గాలి నుంచి నత్రజనిని గ్రహించి మొక్కలకు అందిస్తే మొక్క పెరుగుదలతో పాటు నేల సారం కూడా పెరుగుతుందన్నారు. ఆ పైరును పొలంలో దున్నినప్పుడు చీకిన పదార్థం నేలలో కలిసి నేల గుల్ల బారడంతో నీరు ఎక్కువగా ఇంకుతుందన్నారు. సాగు చేసిన పంటలకు అధిక దిగుబడుల కోసం విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడి భూసారం దెబ్బతిని సూక్ష్మపోషక పదార్థాల లక్ష్యత క్షీణించి భూములు పాలచౌడు, కారు చౌడు నేలలుగా మారుతాయని రైతులకు తెలియజేయాలన్నారు. భూమి ఆరోగ్య పరిరక్షణకు రైతులు రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులైన వానపాము ఎరువులు, పశువుల ఎరువుల వాడాలన్నారు. మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించేలా చూడండి



సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న లింగారెడ్డి

కురిచేడు: పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చేసి, రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి కోరారు. వైఎస్సార్ పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో సోమవారం జరిగిన పార్టీ జిల్లా అధికార ప్రతినిధుల సమావేశానికి హాజరైన లింగారెడ్డి ఆ మేరకు రామకృష్ణారెడ్డిని కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని, కార్యకర్తలకు సభ్యత్వాలు ఏర్పాటు చేసి మెరుగైన బీమా పాలసీని ప్రవేశ పెట్టాలని కోరారు. అందుకు స్పందించిన సజ్జల రామకృష్ణారెడ్డి ఈ విషయాలను పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి 2.0 ను కార్యకర్తల కోసం బలంగా తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. లింగారెడ్డి వెంట పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కోలా సంతోష్‌కుమార్, అంకే గోపాలకృష్ణ ఉన్నారు.

రోగులు ఫుల్..పరీక్షలు నిల్!



పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రం



మూతబడిన రక్త పరీక్షల కేంద్రం

● వైద్యశాలల్లో ల్యాబ్ టెక్నీషియన్‌లు లేక అవస్థలు
● రక్త పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్న ప్రజలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో అధునాతన హంగులు, సకల సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది కొరతతో అల్లాడుతోంది. నిత్యం వందలాది మంది రోగులతో నిండి ఉండే సామాజిక ఆరోగ్య కేంద్రంలో 15 రోజులుగా రక్త పరీక్షలు నిర్వహించే సిబ్బంది లేక ఇబ్బందులు పడుతోంది. ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులను భర్తీ చేయడంలో ఉన్నతాధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో సిబ్బంది కొరతతో సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పలు పరీక్షల ల్యాబ్ మూతబడింది. దీంతో వైద్యశాలకు వచ్చే రోగులకు రోగ నిర్ధారణ జరగక పోవటంతో వారికి వచ్చిన జబ్బేమిటో తెలియక ఏ మందు ఇవ్వాల్లో అర్థంగాక వైద్యాధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిరుపేదలకు అందాల్సిన వైద్యం ఎండమావిలా మారింది. దీంతో మండల ప్రజలు రోగ నిర్ధారణ కోసం ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తూ వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు.

ల్యాబ్ మూతతో రోగుల ఇబ్బందులు

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలకు సంబంధించిన ల్యాబ్ 15 రోజులుగా మూతబడటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరోగ్య స్థితిగతులు, రోగ నిర్ధారణ పరీక్షల కోసం వేలకు వేలు వెచ్చించి ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం సుగర్ టెస్టులు చేయించుకోవాలన్నా వందల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. హైపటైటిస్ బి, హెమోగ్లోబిన్, టీబీ తదితర పరీక్షల కోసం బయటకు పరుగులు తీయాల్సి వస్తోందని, వీటి కోసం 500 రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక గర్భిణులకు హెచ్ఐవీ, హెచ్‌బీఎస్, హెచ్‌సీవి లాంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే ల్యాబ్ టెక్నీషియన్‌ల కొరతతో ఆయా పరీక్షల కోసం 1000 రూపాయల వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఈ విషయమై సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ వైద్య సంజీవ్‌ను వివరణ కోరగా ల్యాబ్ టెక్నీషియన్లు లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని, రిక్రూట్‌మెంట్లు జరుగుతున్నాయని త్వరలోనే ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేస్తామని ఉన్నతాధికారులు తెలిపినట్లు వైద్య సంజీవ్ తెలిపారు. ఏది ఏమైనా సిబ్బంది కొరత విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

30లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

పుల్లలచెరువు: మండలంలోని రేషన్‌కార్డు లబ్దిదారులు ఈ నెల 30వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని డీటీ రాధాకృష్ణ సోమవారం తెలిపారు. కార్డుదారులు వారి పరిధిలోని డీలర్ లేదా సచివాలయం వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయని, గ్రామాల్లో ఎవరైనా ఉంటే తక్షణమే చేయించుకోవాలన్నారు.